భక్తి శ్రద్ధలతో గణపతి హోమం



ముత్వెల్లిగూడలో హోమం చేస్తున్న దృశ్యం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ముత్వెల్లిగూడ, డ్రీమ్ హోమ్స్ కాలనీలో ఆదివారం గణపతి హోమం నిర్వహించారు. కార్యసిద్ధి కోసం గణపతి హోమం చేశామని నిర్వాహకులు చెప్పారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సభ్యుడు బుచ్చిరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రాంతి కీన్ ఆధ్వర్యంలో 'మొక్క నాటు గిఫ్ట్ పట్టు'



కీసర: దమ్మాయిగూడ క్రాంతి కీన్ ఆధ్వర్యంలో 'మొక్క నాటు గిఫ్ట్ పట్టు' లక్కీ డ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్క నాటి సెల్ఫీ దిగి పంపిన ప్రతి పదిమందిలో ఒకరిని ఎంపిక చేసి లక్కీ డ్రా ద్వారా విజేతలకు ప్రిన్సిపాల్ కల్యాణి స్టీల్ వాటర్ బాటిళ్లను అందజేశారు. మెగా లక్కీ విన్నర్‌కు రేంజర్ సైకిల్ బహుమతిగా అందజేశారు. ఫౌండేషన్ డైరెక్టర్స్ పీఎస్ఆర్ క్రాంతి, లావణ్య, ఫౌండేషన్ సభ్యులు సంతోష్, కవిత, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం నూతన కమిటీ



ఘట్‌కేసర్ రెడ్డి సంఘం నూతన కమిటీ సభ్యులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా చందుపట్ల వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఎన్నికల అధికారి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో 82 ఓట్ల తేడాతో గెలుపొందారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా కొమ్మిడి శివప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్‌రెడ్డి, ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కంభం లక్ష్మారెడ్డి, కార్యవర్గసభ్యుడిగా రవీందర్ రెడ్డిని ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని, సభ్యులందరూ సహకరించాలని కోరారు.

సౌండ్ సిస్టమ్‌తో ఆటలు !

– ఇద్దరిపై కేసు నమోదు

పోచారం: సౌండ్ సిస్టమ్‌తో ఆటలు ఆడుతున్న వ్యక్తులపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఏకశిలానగర్‌లో అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకుని చౌదరిగూడకు చెందిన డీజే ఆపరేటర్ వర్ధన్ (24), ఎలక్ట్రిషియన్ నవీన్ (26)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధికస్థాయిలో సౌండ్ పెట్టుకుని ఆటలాడుతున్నందుకు వీరిపై కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలో లభించిన యాంప్లిఫైర్లు (5), డీబీఎక్స్ క్రాస్ ఓవర్ (1), బేక్ బాక్స్‌లు (2), ఆడియో మిక్సర్ (1) స్వాధీనం చేసుకున్నారు.

ఎన్నాళ్లీ అవస్థలు ?

వర్షాకాలంలో ప్రజలకు తప్పని తిప్పలు

- ప్రధాన రహదారిపై వరదతో నిలిచిపోతున్న రాకపోకలు
- గ్రామాలు పట్టణాలుగా మారినా మారని పరిస్థితి



మేడ్చల్-కిష్టాపూర్ రోడ్డుపై నుంచి వరద ప్రవాహం (ఫైల్)

మేడ్చల్: నియోజకవర్గంలో ఒక్క రోజు భారీ వర్షం కురిసి వాగులు పొంగితే.. రెండ్రోజుల పాటు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రత్యామ్నాయ మార్గాలు ఉండటంతో ఆ గ్రామస్తులు చుట్టూ.. తిరిగి వెళ్లాల్సి వస్తుంది. ప్రధాన రోడ్లలో పురాతన కాలం నాటి పద్ధతిలో లోలెవల్ బ్రిడ్జిలే ఉండటంతో వాగులు పొంగుతూ.. రోడ్లపైనుంచి వరద ప్రవాహం ఉండటంతో రోడ్లగుండా రాకపోకలు నిలిచిపోతున్నాయి. మండల కేంద్రంలోనూ రాకపోకలు తెగిపోతున్నాయి.

◆ నియోజకవర్గంలో ప్రధానంగా మేడ్చల్, ఎల్లంపేట్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో వర్షాలు పడితే మేడ్చల్, గౌడవెల్లి, మేడ్చల్–కిష్టాపూర్, గుండ్లపోచంపల్లి–నూతన్‌కల్ రూట్లు, లింగాపూర్ డబీల్‌పూర్, నూతన్‌కల్ –మేడ్చల్ రూట్లల్లో లోలెవల్ బ్రిడ్జిలు ఉండటంతో బ్రిడ్జి పైనుంచి వరద ప్రవాహం కారణంగా రాకపోకలు నిలిచిపోతున్నాయి.

◆ మేడ్చల్ మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో రియల్ దందా జోరుగా ఉండటంతో పంట పొలాలు తగ్గి ప్లాట్లు ఎక్కువగా మరాయి. దీంతో చెరువుల కింద ఆయకట్టు పూర్తిగా తగ్గిపోయింది. దాదాపు అన్ని గొలుసు కట్టు చెరువులు కుంటలు కావడం, రెండు మూడేళ్ల నుంచి అన్ని నీటితో నిండి ఉండటంతో చిన్నపాటి వర్షానికే పొంగిపొర్లుతున్నాయి. భవిష్యత్తులో కూడా ఇలాగే ఉండే పరిస్థితి కనిపిస్తుంది. దీంతో చిన్నపాటి వర్షాలకు చెరువులు, కుంటలు పొంగడంతో వాగులు దిగువ చెరువులోకి చేరడానికి నీటీతో నిండుగా వెళ్తూ.. రోడ్లపైకి నీటిని నింపుతున్నాయి. దీంతో అందరికి ఇబ్బందులు ఏర్పడటమే కాకుండా రోడ్లు దెబ్బతింటున్నాయి.



మేడ్చల్ -గౌడవెల్లిలో.. (ఫైల్)

శాశ్వత పరిష్కారం చూపాలి

వర్షం పడిన ప్రతిసారి గ్రామాల నుంచి నగరానికి వెళ్లాలంటే బండమాదారం, శ్రీరంగవరం, రాయిలాపూర్, గిర్మాపూర్, లింగాపూర్, కిష్టాపూర్ తదితర గ్రామాల ప్రజలతో పాటు మేడ్చల్‌లో పలు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు వర్షం పడిన సమయంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులతో ప్రతీ ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు.

వర్షం పడితే చుట్టూ.. తిరగాల్సి వస్తుంది



వర్షం కురిస్తే చాలు మేడ్చల్ నుంచి కిష్టాపూర్ వాగుకు పైన ఉన్న కాలనీలకు వెళ్లాలంటే మేడ్చల్ నుంచి చెక్‌పోస్టుకు వెళ్లి అక్కడి నుంచి కిష్టాపూర్‌కు వెళ్లాల్సి వస్తుంది. 2–3 రోజులు వాగు పొంగి, కల్వర్టు పూర్తిగా మునిగి ఉండటంతో నిత్యం 2 కి.మీ ప్రయాణానికి బదులు 5 కి.మీ తిరగాల్సి వస్తుంది.

– భీంరెడ్డి, కిష్టాపూర్

వరదలొస్తే రాకపోకలకు అంతరాయం



వర్షాలు కురిసి వరదలు వస్తే బండమాదారం గ్రామంకు పూర్తిగా రాకపోకలు బంద్ అవుతున్నాయి. లోలెవల్ బ్రిడ్జి నుండి వరద నీరు వెళుతుండటంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాకపోకలు నిలిపేస్తుంటడంతో శ్రీరంగవరం మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తుంది.

– కృష్ణ, బండమాదారం

ప్రధాన రోడ్డులో తప్పని తిప్పలు



గుండ్లపోచంపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీలను కలిపే ప్రధానరోడ్డు గుండ్లపోచంపల్లి నుంచి డబీల్‌పూర్ వరకు ఉంది. ఈ రూట్‌లోనే బస్సులు, ద్విచక్రవాహనాలు, లారీలు అన్ని వాహనాలు వెళ్తున్నాయి. రాయిలాపూర్ శివార్లలో లో లెవల్ బ్రిడ్జిపై నుంచి వరద వెళ్తుండటంతో ప్రధాన రోడ్డుపైనే రాకపోకలు నిలిచిపోగా.. పది గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– రాజ్‌గోపాల్‌రెడ్డి, గౌడవెల్లి

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



మేడ్చల్–గౌడవెల్లి రూట్‌లో మేడ్చల్‌కు వెళ్లే దారిలో మేడ్చల్ పెద్ద చెరువు ఉంది. వరద నీరు చేరే ప్రధాన వనరు కాగా.. భారీ వర్షాలు కురిస్తే వాగుపై ఉన్న కల్వర్టు పై నుంచి నీరు వెళ్తుంది. దీంతో అధికారులు రాకపోకలను నిలిపేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. పాలకులు, అధికారులు పట్టించుకుని మేడ్చల్ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

– వీరేష్, గౌడవెల్లి

ప్రశాంతంగా నిమజ్జనాలు చేపట్టాలి

శామీర్‌పేట్: ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనాలు చేపట్టాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. ఆదివారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని శామీర్‌పేట పెద్ద చెరువు, దేవరయాంజాల్ చెరువు, తూంకుంట చెరువు, పోతాయిపల్లి చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు చేపట్టాలని, అన్ని చెరువుల వద్ద నిమజ్జన సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'సీఎంఆర్' విద్యార్థులకు సన్మానం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాల విద్యార్థులకు సైబేజ్ ఖుష్బూ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆదివారం నగరంలో సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ తమ సీఎస్ఆర్‌లో భాగంగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో భాగంగా బీటెక్ పూర్తిచేసి పలు సంస్థల్లో ఉద్యోగం చేస్తున్న విద్యార్థులకు సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. దుర్గాప్రసాద్, శేషుకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సెప్టెంబర్ 13,14న తెలంగాణ రాష్ట్ర మహాసభలు



కీసర: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని దమ్మాయిగూడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బంగారు నర్సింగ్‌రావు అన్నారు. ఆదివారం దమ్మాయిగూడ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 13,14న తెలంగాణ రాష్ట్ర మహాసభల నేపథ్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వారికి ప్రభుత్వ ఆరు గ్యారంటీలు అమలు చేయాలన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని తుర్కయాంజాల్‌లో తెలంగాణ రాష్ట్ర మహాసభలు నిర్వహించబోతున్నామని ప్రకటించారు. వెంకటేష్, కృష్ణ, ముక్కెల కృష్ణ, దశరథ్, గోపాల్, అశోక్, బలరాం, గోపి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే హక్కుల సాధన



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న మాధవి, అరుణ్‌కుమార్



జవహర్‌నగర్‌లో..

ఘట్‌కేసర్: విద్యతోనే జ్ఞానం లభిస్తుందని, జ్ఞానంతోనే మన హక్కులు తెలుసుకునేందుకు అవకాశం లభిస్తుందని మహిళా మోర్చా మున్సిపల్ అధ్యక్షురాలు మాధవి అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. చదువుకోవాలని కోరిక ఉన్న ప్రతి ఒక్కరికి తోడ్పాటును అందించి జ్ఞానవంతులను చేయాలన్నారు. ప్రపంచంలోనే అంబేడ్కర్‌కు అధిక విగ్రహాలు ఉన్నాయని, అందరూ అంబేడ్కర్ ఆలోచనా విధానాలను అనుసరించాలని పిలుపునిచ్చారు. దాసు, నర్సింగ్‌రావు, రాందాసు, సత్యం, శ్రీనివాస్, నారాయణ, సురేష్‌గౌడ్, జగదీష్, కృష్ణంరాజు, లలిత్ పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో జ్ఞానమాల..

జవహర్‌నగర్: జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి ఫౌండర్ మహంకాళి బిక్షు ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రధాన చౌరస్తాలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, మహనీయులకు పూలమాల వేసి నివాళులర్పించారు. జవహర్‌నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ.పాషామియా, కాలేషా, రమేష్, మోహినుద్దీన్, ముబాషీర్, అబ్బు, గిరి, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణ పనుల పరిశీలన

కీసర: నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవనాన్ని ఆదివారం తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులకు అవసరమైన నిధులను కేటాయించి పనులు త్వరగా పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు స్పష్టం చేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సెక్రటరీ సురేష్ బాబు, స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

7న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

జవహర్‌నగర్: ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని సెప్టెంబర్ 7న నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి శివబాబు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులందరికీ డబుల్ బెడ్రూమ్‌లు మంజూరు చేయాలన్నారు. కార్మికులు ప్రమాదంలో మృతిచెందితే రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా, సాధారణ మరణం పొందితే రూ.10 లక్షలు, దహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ కార్మికులందరికీ అందచేయాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ నాయకులు యాదయ్య, రాములు, ఉపేందర్, వెంకటమ్మ, రేణుక, లక్ష్మి, ఎల్లేష్ పాల్గొన్నారు.



రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



ఘట్‌కేసర్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సుదర్శన్‌రెడ్డి తదితరులు



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీజేపీ నేతలు ఆదివారం కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇటీవల బిహార్‌లో నిర్వహించిన సమావేశంలో రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్రమోదీ మాతృమూర్తిపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ.. మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మల్లికార్జున్‌ముదిరాజ్, సరస్వతి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ ముదిరాజ్, నాయకులు రామారావు, వసంత్‌రెడ్డి, శ్రీకాంత్, నవనీత, విక్రమ్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ప్రధాని నరేంద్రమోదీ మాతృమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ స్థాయి పాతాళానికి చేరిందని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ సొంతంగా సాధించిందేమీ లేదని, కుటుంబం పేరుతో వారసత్వ రాజకీయం చేస్తున్నాడని విమర్శించారు. యువమోర్చా జిల్లా అధ్యక్షుడు పవన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలుయాదవ్, మల్లేష్‌ముదిరాజ్, లక్ష్మారెడ్డి, రమేష్‌నాయుడు, మధు, మాధవి, మమతశర్మ, మహేష్, ఉదయ్ కుమార్, ముఖేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ రియాజ్

శామీర్‌పేట్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. ఆదివారం అలియాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయ భవనం నిర్మాణం పూర్తి కావొచ్చిందని, ప్రారంభోత్సవం చేపట్టి పాఠకులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ భవన నిర్మాణం జరిగిందని, పాఠకులకు సౌకర్యంగా అన్ని రకాల వసతులను ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లా సెక్రటరీ సురేష్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్‌గౌడ్, అలియాబాద్ మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్, మాజీ వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలపై చర్యలేవి ?

- పురపాలికల్లో అక్రమ నిర్మాణాలు, వ్యాపార సముదాయాలు
- 4 పురపాలికలకు ఒకే టౌన్‌ప్లానింగ్ అధికారి
- అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని వినతి



సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారుల్లో అనుమతి లేని భవనాలు, వ్యాపార వాణిజ్య సముదాయాల గుర్తింపు ప్రక్రియపై పురపాలక సంఘాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. అక్రమ కట్టడాలు, బహుళ అంతస్తులు, వ్యాపార వాణిజ్య సముదాయాలపై నివేదిక అందజేయాలని పురపాలిక శాఖ ఆదేశించడంతో ఈ ప్రక్రియకు శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.

క్షేత్రస్థాయిలో పరిశీలన..

పురపాలికల్లో రికార్డు పరంగా ఉన్న ఇళ్లకు వాస్తవంగా ఉన్న నిర్మాణాలకు వ్యత్యాసం ఉండటంతో ఆ దిశగా గుర్తింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. వార్డులు/డివిజన్ల వారీగా భవనాల జాబితాను తీసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. రికార్డుల్లో లేని నిర్మాణాలను ప్రత్యేక జాబితాలో నమోదు చేస్తున్నారు. ఏళ్లుగా భవన నిర్మాణాలు, వ్యాపార వాణిజ్య సముదాయాలు ఉన్నప్పటికీ మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలు రికార్డుల్లో నమోదు కాకపోవడంతో ప్రస్తుతం అవి సంబంధిత అధికారుల దృష్టికి చేరుతున్నాయి.

అనుమతికి భిన్నంగా ఉంటే..

గుర్తింపుల్లో అనుమతిలేని నిర్మాణమని తేలితే ఎన్నేళ్ల క్రితం నిర్మించుకున్నారో..! వివరాలు సేకరించి, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంతమేర.. ? పన్ను అవుతుందో మొత్తానికి చెల్లించాల్సి ఉంటుంది. ఒక అంతస్తు అని అనుమతి తీసుకుని, 2- 3 అంతస్తులు నిర్మించుకున్న వారికి కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది.

సర్వేతో వివరాల సేకరణ..

సర్వేలో ఇంటికి సంబంధించిన పూర్తి వివరాలు, మొత్తం ప్లాటు విస్తీర్ణం, ఇంటిని నిర్మించిన స్థలం, ఖాళీ స్థలం ఎంత ఉంది..? అనేది గుర్తిస్తున్నామన్నారు. కొత్తగా నిర్మించుకుంటున్న వాటిని పరిశీలించి అనుమతి లేకపోతే నిర్మాణాన్ని నిలిపేయాలని యజమానికి ఆదేశాలిస్తారు.

మొక్కుబడి నోటీసులతో అక్రమాలకు తెర..

శివారు పురపాలక సంఘాల్లో అనుమతులు లేని అక్రమ కట్టడాలు ,బహుళ అంతస్తుల భవనాలకు పలువురు కమిషనర్లు మొక్కుబడిగా నోటీసులు జారీ చేసి అక్రమాలకు తెరలేపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

◆ తూంకుంట పరిధిలో 40 అక్రమ కట్టడాలను గుర్తించిన పుర అధికారులు సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేశారు.

◆ పోచారం పరిధిలో కూడా వరంగల్ జాతీయ రహదారికి ఇరువైపుల పదుల సంఖ్యలో అనుమతులు లేని వ్యాపార, వాణిజ్య భవనాలకు కూడా నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ అక్రమ కట్టడాలపై కలెక్టరేట్ ప్రజావాణితో సహా అధికార యంత్రాంగానికి పలుమార్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలోనే ఇటీవల బాధ్యతలు చేపట్టిన పుర అధికారులు నోటీసుల జారీకి సన్నద్ధమైనట్లు సమాచారం.

హైడ్రాకు సమాచారమిచ్చి..

అక్రమంగా నిర్మించిన కట్టడాలపై హైడ్రాకు సమాచారమిచ్చి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘట్‌కేసర్, నాగారం, కొంపల్లి, దుండిగల్, దమ్మాయిగూడ, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఎల్లంపేట, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీలతో సహా జవహర్‌నగర్, పీర్జాదిగూడ, బోడుప్పల్, నిజాంపేట్ కార్పొరేషన్లలో కూడా అక్రమ నిర్మాణాల జోరు ఉన్నా... పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మచ్చుకు కొన్ని ..

మేడ్చల్ జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సంఖ్య 1.68 లక్షలు కాగా.. 16 పురపాలక సంఘాల పరిధిలో అనుమతి లేని భవనాలు, వ్యాపార సముదాయాలు వందల్లోనే ఉంటాయని అంచనా.

అదనపు పనిభారం

తూంకుంట ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారి దేవరకొండతో సహా ఎల్లంపేట్, మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపాలిటీలకు కూడా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతో 12 పురపాలక సంఘాల్లో కూడా ఇన్‌చార్జ్ టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే అన్ని బాధ్యతలను కమిషనర్లు పర్యవేక్షించాల్సి రావడంతో అదనపు పనిభారంతో వారి బాధ్యతలను నిర్వహించలేకపోతున్నారు. దీనిద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోందని స్థానికులు, పలు స్వచ్ఛంధ సంస్థలు, ప్రజా సంఘాలు, సమాచార హక్కుల కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

గణపయ్యకు ఘనంగా పూజలు



గుండ్లపోచంపల్లిలోని అపర్ణ కెనోపీలో వినాయక పూజల్లో ఎంపీ ఈటల

మేడ్చల్‌రూరల్: వినాయక నవరాత్రుల్లో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అపర్ణ కెనోపీ విల్లాలో గణనాథుడి పూజల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మల్లికార్జున్‌ముదిరాజ్, సరస్వతి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలో వినాయక నవరాత్రి పూజలు ఆదివారం ఐదవరోజు ఘనంగా జరిగాయి. పలుచోట్ల అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ఘట్‌కేసర్: పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలో ప్రతిష్టించిన స్వామి వివేకానంద వినాయక మండపం దగ్గర, బ్రూక్ బాండ్ కాలనీ, నాగులమ్మ అమ్మవారి ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ అన్నప్రసాద వితరణ చేశారు. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, జంగయ్యయాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ ప్రారంభించారు.



జవహర్‌నగర్ శ్రీకృష్ణపురి కాలనీలో మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్